క్లుప్తంగా

వార్డులను అభివృద్ధి చేస్తా

కర్నూలు(సెంట్రల్): తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కర్నూలు మునిసిపల్ పరిధిలోని 16 కల్లూరు వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సీపీఎం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శుక్రవారం 34వ వార్డు పరిధిలోని శివయ్య నగర్, సంపత్ నగర్, కృష్ణారెడ్డి నగర్, గోపీ నగర్, బృందావన్ నగర్, నిర్మల్ నగర్‌లలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జె.లక్ష్మీ నరసింహను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, గురుశేఖర్, మాజీ కార్పొరేటర్ చలపతి పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ వార్షికోత్సవం



యువజన సమాఖ్య జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్.మునెప్ప, పి.రామకృష్ణారెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఏఐవైఎఫ్ 65వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సమాఖ్య జెండాను మాజీ నాయకులు ఎస్.మునెప్ప, పి.రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉద్యోగ, ఉపాధి కల్పనపై పోరాటాలకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, బీసన్న, కాశీం, చిన్న, శివ, హుస్సేన్, బాషా, మధు, శ్రీనివాసులు, రాజశేఖర్, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సైనికుడు మృతి

కర్నూలు(అర్బన్): జిల్లాకు చెందిన మాజీ సైనికుడు మురారి విక్టర్ అనారోగ్యంతో మృతి చెందినట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మీలో పనిచేసి రిటైర్ అయిన అనంతరం స్థానిక దూరదర్శన్‌లో పనిచేసేవారన్నారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన ఆత్మకూరు తాలూకా వెంకటాపురంలో నిర్వహించారన్నారు. ఆయన మృతి పట్ల జిల్లా మాజీ సైనికుల సంక్షేమం సంఘం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తుందన్నారు.

మేలు చేసే వారికి పట్టం కట్టాలి



32వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసులు

కల్లూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ఎంతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఆశీర్వదించాలని కల్లూరు అర్బన్ 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వార్డులో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

దేవస్థాన వైద్యశాలకు వైద్య పరికరాల అందజేత



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న దేవస్థాన వైద్యశాలకు పలు వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.వి.ఆర్.కృష్ణంరాజు దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్-1, డిఫిబ్రేటర్-1, కార్డిక్ మానిటర్-1, బైపాస్ మిషన్-2, ఇన్ఫ్యూషన్ పంపులు-2 విరాళంగా అందజేశారు. ఆయా వైద్య పరికరాలను దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.16 లక్షలకు పైగా ఉంటుందని దాతలు తెలిపారు. ఆయా పరికరాలను అత్యవసర చికిత్స నిమిత్తం గుండెకు సంబంధించిన పరీక్షలు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వసతి విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వీ మోహన్, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు అయ్యన్న, అపోలో డాక్టర్లు సాయికిషన్, డాక్టర్ శశిధర్, గుమస్తా నాగేంద్రం, దేవస్థాన వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

గూడూరు: పట్టణంలో వెలసిన తిమ్మగురుడు స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రారంభ రథోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాల మధ్య రథంపై కొలువుదీర్చారు. అనంతరం భక్తులు జయ జయధ్వానాల నడుమ రథాన్ని భక్తులు 5 అడుగుల దూరం లాగారు. శనివారం సంపూర్ణ రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ గెర్రెడ్డి తెలిపారు.

ముస్లిం రిజర్వేషన్ల రద్దుకు కుట్ర



వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించి ఏఎండీ ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీని సన్మానిస్తున్న కర్నూలు సిటీ ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నాయకులు



వైఎస్సార్‌సీపీ కర్నూలు అభ్యర్థి ఇంతియాజ్‌కు పూలమాల వేస్తున్న కర్నూలు జంగం, లింగాయత్‌ల అసోసియేషన్ నాయకులు



6వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏఎండీ ఇంతియాజ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి

- చంద్రబాబు మాయమాటలను నమ్మొద్దు
- పేద వర్గాలకు అండగా నిలిచే జగనన్నకు ఓటు వేయండి
- వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్
- 6, 14వ వార్డుల్లో విస్తృత ప్రచారం
- స్థానికుల నుంచి విశేషంగా స్పందన

కర్నూలు (టౌన్): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం మైనార్టీల నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తారని, ఇప్పటికే ఆ దిశగా కుట్ర జరుగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్ స్పష్టం చేశారు. పేద వర్గాలకు అండగా నిలుస్తున్న జగనన్నకు ఓటు వేయాలని ఆయన పిలుపు నిచ్చారు. శుక్రవారం నగరంలోని 6వ వార్డు గడ్డ, మేదరి వీధుల్లో స్థానిక కార్పొరేటర్ షేక్ నీలోఫర్, పార్టీ నాయకులు హాకీం ఆధ్వర్యంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎస్వీమోహన్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న మేనిఫెస్టో ఇచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఏఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, నేడు జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ముస్లిం వర్గాలకు సంపూర్ణ న్యాయం జరిగిందన్నారు. మైనార్టీ వర్గాల అభివృద్ధికి జగనన్న ఎంతో కృషి చేశారన్నారు. అయితే తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకున్నాడని చెప్పారు. ఇప్పటికే ఆ పార్టీ అగ్రనేతలు ముస్లింల రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించారని.. దీనిపై స్పందించాల్సిన చంద్రబాబు నోరు మెదపడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మాట్లాడుతూ కూటమికి ఓటు వేస్తే ముస్లిం వర్గాలకు తీరని అన్యాయం చేస్తారని చెప్పారు. బీ ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బహిరంగంగా చెబుతున్నా బీజేపీతో రాష్ట్రంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు పొత్తు ఎలా పెట్టుకున్నాడన్నారు. మత పార్టీని గెలిపిస్తే ముస్లింలు ఇబ్బందులు పడతారని, జగనన్న వల్లే ముస్లింల అభివృద్ధి జరుగుతుందన్నారు.

నగర అభివృద్ధికి ఓటు వేయండి

స్థానిక ధర్మపేటలో డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ ఆధ్వర్యంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ సతీమణి సమీనా ఇంతియాజ్, జిల్లా సహకారా కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి జగనన్న మేనిఫెస్టోను అందజేశారు. ఈ సందర్భంగా సమీనా ఇంతియాజ్ మాట్లాడుతూ మంచి అధికారిగా పేరున్న ఇంతియాజ్ ప్రజాసేవ చేసేందుకు ముందుకు వచ్చారన్నారు.ఆయనకు ఓటేసి గెలిపిస్తే నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. నగరంలోని అన్ని వర్గాల ప్రజలు మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నాయకులు రైల్వే ప్రసాద్ పాల్గొన్నారు



ధర్మపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సమీనా ఇంతియాజ్

పలువురు మద్దతు

- నగరంలోని జంగం, లింగాయత్‌ల సంఘం కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం స్థానిక నరసింగరావు పేటలోని ఆ పార్టీ నగర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వినయ్ మురారి, కిషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కోటేశ్వరయ్య, భాస్కర్, గంగాధర్, శాస్త్రి తదితరులు పార్టీలో చేరారు. వారికి ఏఎండీ ఇంతియాజ్ పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీకి సాదరంగా ఆహ్వానించారు.
- నగరంలోని ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ శుక్రవారం వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఎస్వీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు కిషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పార్టీలో చేరారు. అనంతరం వారు కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ ఎస్వీమోహన్‌రెడ్డిని ఘనంగా సత్కరించి, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు.



17 వ వార్డులో ఫ్యాన్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయ మనోహరి



బిర్లాగడ్డ వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ

17వ వార్డులో కేడీసీసీబీ చైర్‌పర్సన్ ప్రచారం

కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్‌ను గెలిపించాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విజయమనోహరి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం స్థానిక 17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించా రు.చంద్ర, విజయలక్ష్మి అపార్టుమెంట్‌లలో నివసిస్తు న్న వారిని కలిశారు. జగనన్న మేనిఫెస్టో ప్రతులు అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంచి అభ్యర్థి, విద్యాధికుడు, ఐఏఎస్ హోదాలో పనిచేసి పదవికి రాజీనామా చేసి కర్నూలుకు అసెంబ్లీ అభ్యర్థిగా నిలిచిన ఇంతియాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కా ర్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర రెడ్డి, వెంకటరామిరెడ్డి, నాగర్జున రెడ్డి, కిశోర్, బాలనాగిరెడ్డి, నరసింహారెడ్డి, రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేరుతో మోసం

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పేరుతో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేసేందుకు కుట్రపన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షురాలు సిట్రాసత్యనారాయణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక 25 వ వార్డు పరిధిలోని దేవనగర్, బిర్లాగడ్డ ఏరియాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న మేనిఫెస్టో కరపత్రాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ సూపర్ సిక్స్‌లో పెన్షన్ హామీ మాయమైందని, ఎన్నికల తరువాత చంద్రబాబు మాయం కావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ, రంగ, దుర్గా, సురేష్, శేఖర్‌రెడ్డి, మద్దిలేటి, సుబ్రమాణ్యం పాల్గొన్నారు.

కూటమిని నమ్మితే మోసపోతారు



మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి

- ఎన్నికల ప్రచారంలో కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

కర్నూలు సిటీ: 2014 ఎన్నికల్లో మాదిరిగానే చంద్రబాబు నాయుడు జత కట్టిన కూటమిని నమ్మితే మోసపోతారని, గతంలో వారు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఇళ్లు లేని పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చారన్నారు. ఈ రోజు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడు పేరు చెబితే పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి విషయం ప్రజలకు గుర్తుకు వస్తుందన్నారు. ఇప్పుడు అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని, ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పింఛన్‌దారుల ఉసురు తప్పదు

ప్రతి నెలా 1వ తేదీ ఇంటికే వలంటీర్లు వెళ్లి పింఛన్ ఇచ్చేవారని, అది చూసి తట్టుకోలేక చంద్రబాబు అడ్డంకులు సృష్టించారని సతీష్ అన్నారు. దీంతో రెండు నెలల నుంచి సకాలంలో పింఛను అందుకోలేక వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బాబుకు వారి ఉసురు తప్పక కొట్టుకుంటుందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు కూడా రావన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పల్లెల్లో మౌలిక సదుపాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.ఈ అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే తమకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్న కుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు డి.వాసు, గ్రామ సర్పంచ్ బోయ శ్రీనివాసులు, ఎంపీటీసీ కృష్ణవేణి, గొందిపర్ల గోపాల్, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సూర్యచంద్రారెడ్డి, సుధాకర్, రాజశేఖర్, వెంకటేశ్వరరెడ్డి, గొందిపర్ల మహబూబ్ బాష, బోయినపల్లి శ్రీను, ఫిల్టర్ శీను, కె.మధు, తదితరులు పాల్గొన్నారు.

14 మంది వలంటీర్ల రాజీనామా

కర్నూలు సిటీ: మండల పరిధిలోని బి.తాండ్రపాడు, పంచలింగాల, ఈ.తాండ్రపాడు గ్రామాలకు చెందిన వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. కర్నూలు ఎంపీడీఓ నరసింహనాయుడుకు అందుకు సంబంధించిన లేఖలు అందజేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవలు అందిస్తున్న తమను కొన్ని రాజకీయ పార్టీల నాయకులు అవమానపరిచేలా మాట్లడటం సరికాదని ఈసందర్భంగా వారు పేర్కొన్నారు.



రాజీనామా లేఖను ఎంపీడీఓకు అందజేస్తున్న బి.తాండ్రపాడు వలంటీర్లు

టీడీపీ హామీలు ఆచరణ సాధ్యం కావు



ఓటు వేయాలని వృద్ధుడిని కోరుతున్న శివ నరసింహారెడ్డి

కల్లూరు: అమలు సాధ్యం కాని హామీలతో టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి తనయుడు పోచా జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. నవరత్నాలు, ఇతర పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మరోసారి పట్టం కట్టాలని కోరారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానంద్దారెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిని భారీ మెజారీతో గెలిపించాలన్నారు. నాయకులు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఉప సర్పంచ్ రహీమ్, అభి, స్వాములు పాల్గొన్నారు.

హిందూ సనాతన ధర్మాన్ని నేర్పించాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ

కర్నూలు కల్చరల్: హిందూ సనాతన ధర్మాన్ని నేటి పిల్లలకు నేర్పడం అత్యవసరమని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ అన్నారు. శుక్రవారం ఆదిత్య విద్యాలయంలో వీహెచ్‌పీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించాలన్నారు. ఉమ్మడి కుటుంబాలతో అనేక ప్రయోజనాలు ఉండేవన్నారు. ప్రస్తుతం చిన్న కుటుంబాలు కావడంతో పిల్లలకు నైతిక విలువలు, సంప్రదాయాలు, సంస్కారం నేర్పేవారు కరువయ్యాయన్నారు. అంతకు ముందు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ వాసుదేవయ్య, పాఠశాల అధినేత వరలక్ష్మి, శిబిరం నిర్వాహకురాలు మాతృశక్తి నగర కన్వీనర్ పావని, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, జిల్లా ఆర్‌ఎస్ఎస్ ప్రసార ప్రచార కన్వీనర్ విశ్వనాథ్, వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు చంద్రశేఖరప్ప, మాతృశక్తి కన్వీనర్ జంపాల రాధిక, తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌నుద్దేశించి మాట్లాడుతున్న కర్నూలు ఆర్‌ఓ

కర్నూలు (టౌన్): ఎన్నికల ప్రక్రియలో భాగంగా నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శుక్రవారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ పర్యవేక్షించారు. 5 శాతం ఈవీఎంలలో 1000 ఓట్లు వేసి పారదర్శకంగా నిర్ధారించినట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బందికి అవగాహన పెంచేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. శనివారం కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఈవీఎంలపై కమిషనింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్ కుమార్, నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ప్రాంతీయ ప్ర భుత్వ సర్వజన వైద్యశాల, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాల వద్ద శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. స్థానికంగా విద్యు త్ సరఫరా సమయంలో ట్రిప్ కావడంతో ఈ మూడు ప్రాంతాల్లో మధ్యా హ్నం గంట పాటు విద్యుత్ నిలిచిపోయింది. ఈ కారణంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కార్యకలాపాలు, కంటి ఆసుపత్రిలో రోగులకు కంటి పరీక్ష లు, వైద్యపరీక్షలు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య పరీక్షలు, చికిత్సలు నిలిచిపోయాయి. పలు వార్డుల్లో ఫ్యాన్లు తిరగక రోగులు ఇబ్బంది పడ్డారు. అయితే అత్యవసర విభాగాల్లో మాత్రం జనరేటర్ల సహాయంతో అధి కారులు విద్యుత్‌ను సరఫరా చేయడంతో అక్కడ ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు.

అతుల్‌కుమార్ అంజన్ మృతి తీరని లోటు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జాతీయ కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్ హఠాన్మరణం రైతు ఉద్యమాలకు తీరని లోటు అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం పేర్కొన్నా రు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మునెప్ప, పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, సోమన్న, బీసన్న, బాయ్య, శరత్ కుమార్, సురేంద్ర,రామాంజనేయులు పాల్గొన్నారు.

తప్పని అవస్థలు

- పింఛన్ కోసం రెండో రోజూ బ్యాంకుల చుట్టు ప్రదక్షిణ
- మండుటెండల్లో ఇబ్బంది పడిన అవ్వాతాతలు
- చంద్రబాబు వల్లే ఈ కష్టాలని ఆగ్రహం




పెన్షన్‌దారులతో కిక్కిరిసిన యూనియన్ బ్యాంక్

కర్నూలు (టౌన్) : నగరంలో రెండో రోజు పెన్షన్ కష్టాలు తొలగలేదు. శుక్రవారం పెన్షన్ కోసం అవ్వాతాతలు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. గంటల తరబడి క్యూలో నిల్చున్న చేతికి పింఛన్ సొమ్ము అందుకోలేని పరిస్థితి. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీని చంద్రబాబు అడ్డుకోవడంతోనే తమకు ఈ కష్టాలు మొదలయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా సకాలంలో పింఛన్ తీసుకోవడం లేదని.. బాబుకు మాపై ఎందుకింత కక్ష అంటూ వాపోయారు. ఇదిలా ఉంటే మండుతున్న ఎండల్లో వృద్ధులు, వితంతువులు పింఛన్ సొమ్ము కోసం బ్యాంకులకు వెళ్లి తెచ్చుకునేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు.

30 శాతం పెన్షన్ నమోదు

ఎన్నికల ముందు ప్రతి నెలా 1 వ తేదీ పెన్షన్ తీసుకునే పెన్షన్ దారులు రెండు నెలలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మే నెల ప్రారంభమై మూడు రోజులైన 30 శాతం పెన్షన్ పంపిణీ కూడా జరగలేదు. ఎన్నికల కోడ్‌కు ముందు మార్చి నెలలో తొలి మూడు రోజుల్లోనే వలంటీర్ల ద్వారా నగరంలో 95 శాతం పెన్షన్ పంపిణీ జరిగింది. తెలుగుదేశం పార్టీ వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీని అడ్డుకోవడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తాయి. ఏప్రిల్ నెలలో పెన్షన్ పంపిణీ 10 వ తేదీ వరకు సాగగా.. ఈ నెలలో 3 రోజులు దాటినా 30 శాతం లబ్ధిదారులకు కూడా అందలేదు. ఈసారి బ్యాంకులకు అప్పగించడంతో కష్టాలు మరింత పెరిగాయి. ఆటోలకు డబ్బులు ఖర్చు పెట్టుకొని బ్యాంకులకు వస్తున్న పెన్షన్ దారులకు అకౌంట్‌కు ఆధార్ కార్డు లింక్ కాలేదని, అకౌంట్ నిర్వహణ లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో కొందరు చేసేదేమి లేక వెనుదిరిగి పోతున్నారు.దీనికితోడు మరి కొన్ని బ్యాంకుల్లో సర్వర్ సమస్యతో అకౌంట్‌లోని పెన్షన్ సొమ్మును తీసుకోలేని పరిస్థితి.


మందులకు డబ్బులు లేవు



నేను పాతబస్తీ ఏరియాలో ఉంటాను. దాదాపు ఐదు సంవత్సరాలుగా నేను ఇంటి వద్దే పెన్షన్ తీసుకుంటున్నాను. ప్రతి నెల 1 వ తేదీ ఉదయం 7 గంటలకే వలంటీర్ ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చేవారు. గత నెల నుంచి పెన్షన్ సక్రమంగా రావడం లేదు. సచివాలయం దగ్గరకు వెళితే బ్యాంకుకు వెళ్ల మంటున్నారు. ఆటోకు రూ.40 బాడుగ ఇచ్చి బ్యాంకుకు వెళ్లి వస్తున్నాను. ఇంకా పెన్షన్ చేతికి రాలేదు. ఆ సొమ్ము వస్తేనే నేను మాత్రలు తీసుకోగలుగుతాను. చంద్రబాబు వల్లే మాకు ఈ అవస్థలు.

– బుడ్డమ్మ, వితంతుపెన్షన్‌దారురాలు

మమ్మల్ని తిప్పడం మంచిది కాదు



జొహరాపురం నుంచి బ్యాంకుకు వచ్చాను. మొన్నటి వరకు పెన్షన్ ఇంటివద్దే ఇచ్చేవారు. రెండు నెలల నుంచి ఇవ్వడం లేదు. చంద్రబాబు కోర్టులో కేసు వేసి అడ్డుకోవడం వల్లే ఇంటికి పింఛన్ రావడం లేదని అంటున్నారు. బ్యాంకులకు వెళ్లి నా లాంటి వృద్ధులు పింఛన్ తెచ్చుకోవడం కష్టమవుతుంది. నా ఖాతాకు సంబంధించి బ్యాంకులో సరైన నిల్వలు లేవంటున్నారు. ఇందుకోసం కొంత డబ్బు కట్ అవుతుందని చెబుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– రామేశ్వరమ్మ, వృద్ధాప్య పెన్షన్‌దారురాలు